# ఇన్లాండ్ లెటర్ కథలు

## మోసం

రాత్రి తొమ్మిది గంటలయ్యింది. విజయవాడ రైల్వే ప్లాటుఫారం మీదికి మదరాసు వెళ్ళే ఎక్స్‌ప్రెస్ వచ్చి ఆగింది. ఓ కంపార్టుమెంట్ లోని యువకుడు కిటికిలోంచి బయటకు చూస్తున్నాడు. "సార్ సార్ నాకు మీరు ఓ సహాయం చేయండి ప్లీజ్" అంటూ మూర్తి ప్లాటుఫారమ్ మీద నుంచి అర్థించాడు ఆ యువకుడిని.

"ఏమిటది?" అంటూ అటిగాడు ఆ యువకుడు.

"నా భార్యకు వైజాగ్‌లో సీరియస్‌గా ఉందని టెలిగ్రాం వచ్చింది. వైజాగ్ వెడదామని వస్తే నా పర్సు ఎవడో కొట్టేశాడు. అందులోనే టిక్కట్టుంది కూడా. తీరా ఇంటికి వెళ్ళి డబ్బు తెచ్చుకుందామంటే వీలుపడదు. ఎందుకంటే వైజాగ్ వెళ్ళే బండి అర్థ గంటలో వచ్చేస్తోంది." అంటుండగా "అంటే నన్ను డబ్బు సర్దుబాటు చేయమంటావు అదేగా నేను చేయవలసిన సహాయం." అంటూ ఆ యువకుడు నిరసనగా మాట్లాడాడు.

"నాకు ఊరికే డబ్బు వద్దు సార్ ఇదిగో నా గోల్డు రిష్టు వాచ్ తీసుకొని డబ్బు ఇవ్వండి"అని మూర్తి తన వాచ్‌ను ఆ యువకుని చేతిలో పెట్టాడు. యువకుడు వాచిని అటు ఇటూ పరిశీలించాడు. బంగారు మెరుపుతో ధగధగా మెరిసిపోతోంది. అది సరికొత్తదిగా నాణ్యమైనదిగా అతనికి తోచింది. దానిని తీసుకోవాలని ఉన్నా బెట్టు సరిగా"ఇది సెకండు హేండ్ దిలాగున్నది. అయినా ఆపదలో ఉన్న నీకు సహాయం చేయాలని ఉంది. ఎంత ఇమ్మంటావు? " అని అడిగాడు.

"దీనిని నేను నెల రోజుల క్రితమే కొన్నాను సార్. ఎనిమిది వందలకు ఖరీదు చేశాను. నా అవసరం కనుక ఆరు వందలకే మీకు ఇవ్వదలచుకున్నాను." అని ప్రాధేయపూర్వకంగా అన్నాడు మూర్తి.

మొత్తానికి ఆ వాచీని అయిదు వందలకే ఇవ్వడానికి మూర్తి ఒప్పుకున్నాడు కొంత బేరసారాలు సాగిన తరువాత.

ఇంజన్ కూత కూసింది. అనంతరం రైలు మద్రాసు వైపు కదలిపోయింది.

ఉత్సాహంగా మూర్తి ఇంటి దారి పట్టాడు. కారణం అతడు పేరు మోసిన మోసకారి. ఇతరులను మోసగించడం అతని వృత్తి. అసలు ఆ వాచి చాల పాతది. గిల్టుదీను. బ్రహ్మాండమయిన మెరుపు పెట్టించి రియల్ గోల్డు వాచీలా కనబడేటట్టు చేశాడు. ఇలాంటి వ్యవహారాలలో అతనిది అందె వేసిన చెయ్యి. దాని ప్రస్తుత ఖరీదు వంద రూపాయల లోపు వుంటుంది.

ప్రొద్దున్నే షాపింగ్‌కని ఆ అయిదు వందల రూపాయల నోటుని పెట్టె లోంచి తీసాడు మూర్తి. ఆ నోటుని చూడగానే గతుక్కుమన్నాడు. శరీరం ముచ్చెమటలు పోశాయి.

అది దొంగ నోటు. చదువు లేని వాడు కూడ అది దొంగ నోటని ఇట్టే పట్టేస్తాడు. రాత్రి కనబడీ కనబడని ప్లాటుఫారం దీపాల వెలుతురులో తొందరగా జారుకుందామన్నా హడావిడిలో దానిని తాను సరిగ్గా పరిశీలించలేదు. అందరికి టోకరా వేసే తానే టోకరాలో పడ్డాడు. దానిని మార్చడానికి ప్రయత్నిస్తే పోలీసులకు దొరికిపోవడం ఖాయం. పోలీసుల చేతిలో పడితే డొంకంతా కదిలి తన వ్యవహారమంతా బయటపడి ఇంకా చిక్కుల్లో పడడం తథ్యమని నీరసంగా చతికిల పడ్డాడు.



—ఎస్. పేర్రాజు, న్యూఢిల్లీ.

## అమ్మ మనసు

నా రూపమేమిటో, నేను ఎలా ఉంటానో కూడా తెలియకుండానే నన్ను నవ మాసాలు మోస్తూ..నేను కాళ్ళతో తంతున్నా..గాని అమ్మనవుతున్నానన్న గర్వంతో తన కడుపులో నన్ను దాచి నాకంటూ ఒక రూపం వచ్చిన తరువాత ఈ భూమిమీద నీవు బ్రతలగలవా? అని ప్రశ్నించినట్లు నాకు జన్మను ప్రసాదించింది నా కన్నతల్లి. అప్పటి వరకు కాళ్ళు ముడుచుకుని చీకటిలో బ్రతికిన నేను ఆమె ప్రేగును పంచుకొని వెలుగును ఎంచుకొని బయట కొచ్చి ఏడుస్తూ ఉంటే.. దదుచుకొని ఏడుస్తున్నానుకొని లాలిజో..లాలిజో.. అంటూ జోలపాట పాడి నిద్రపుచ్చింది. దినదిన ప్రవర్థమానంగా ఎదుగుతున్న నన్ను చూసి మురిసిపోయి, నేను చెడ్డవాడినవుతానో, మంచివాడ్ని అవుతానో తెలియక పోయినా.. తన దృష్టిలో మనస్సులో నాకందూ ఓ ప్రత్యేకమైన స్థానం ఇచ్చింది నా అమ్మ. నరుని కంటికి నల్ల రాయయినా బ్రద్దలవుతుందన్న నమ్మకంతో ఉప్పు మిరపకాయలు నా చుట్టూ తిప్పి బయట పారేసేది. ఎదిగిన నేను ఆ తల్లి ప్రేమను అర్థం చేసుకోలేక, ఆ అమ్మ ప్రేమకు "మూఢ నమ్మకం" అనే పేరు పెట్టి...ఆమెను నీ చాదస్తాన్ని తగ్గించుకోమని కసిరించుకున్నప్పుడు నా కన్న బిడ్డేగా నన్ను అన్నది అని సరిపుచ్చుకున్నది నా కన్నతల్లి.

వయసొచ్చిన నేను అడ్డగాడిదలా..బలాదూర్లు తిరిగి అర్థరాత్రి ఇల్లు చేరితే మేలుకొనే ఉన్న అమ్మ, నా. ఆకలి బాధను క్షణంలో తీర్చేది. ఆ విశ్వాసం కూడా లేని నేను ఆమె తిన్నదా? లేదా? అన్న ఆలోచననే నా మదిలోనికి రానీయక ఆ విషయమే మరచి, పరచి ఉన్న పడక మీద పవళించెవాడ్ని, అమ్మ తన కడుపు నాయకట్టుకొని నన్ను చదివించి మంచి ఉద్యోగానికి పంపిస్తే..ఆ ఉద్యోగం రాగానే తోడు కోసం అంటూ..అమ్మ తోడు మరిచాను. ఉండడానికి ఇల్లు, ఇంట్లో ఇల్లాలు మిగతా ఖర్చులకు నా ఉద్యోగం అన్నీ సరిపోయాయి.

కానీ, అమ్మ విషయమే అర్థంకాక నా ఇల్లాలికే అప్ప చెప్పాను. అత్త, కోడళ్ళ మధ్య ఏవేవో గొడవలు, తప్పు ఎవరిదైనా..తట్లు మాత్రం అమ్మకిస్తూ వచ్చాను.

అమ్మ కళ్ళ మాటు కన్నీరును కూడా అర్థం చేసుకోలేని దౌర్భాగ్యుడ్ని. భార్య కొంగు చాటు కొంటె కృష్ణుడనై అమ్మ అనే మాటే మరచి అమ్మ అల్లం-భార్య బెల్లం అన్న సామెతకే విలువ నిచ్చి అనారోగ్యంతో అల్లాడుతున్న అమ్మను చేజేతులారా..అంతర్థానం చేసుకొన్న నీచుడను నేను. సృష్టిలో అమ్మ విలువ తెలుసుకొనే నాటికి ఆ అమ్మ నాకు దూరం అయ్యింది. నేను మాత్రం ఈ భూమికి భారంగా మిగిలిపోయాను. కష్టనష్టాలకు మధ్య బ్రతుకు బాట వెంచుకోలేని నాకు ఆనాటి ఆ అమ్మ అనురాగం ఎటుపోయిందో, ఆ అమ్మ ప్రేమ ఏమైందో? నాకు చిన్న బాధ తగిలితేనే ఓర్చుకోలేని ఆ అమ్మ నేను ఏనాడు కష్టపడకూడదనుకున్న నా అమ్మ నన్ను వెలివేసింది. నా బాధలు నన్నే పడమని నేను చేసిన తప్పుకు అలిగి తాను శాశ్వతంగా నాకు అందనంత దూరం వెళ్ళిపోయింది.

—గోపినాథ్

